

కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి కార్పొరేషన్ అవినీతిపై నిలదీయడంతో సభలో తీవ్ర గందరగోళం పరిస్థితి ఏర్పడింది. గతంలో జరిగిన సభకు ఈ సభకు గల వ్యత్యాసాన్ని ఆమె నిలదీశారు. కుర్చీ మార్చడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ చేసిన అవినీతి అక్రమాలను నిలదీస్తాననే కారణంగా తనను దూరం పెడితే డిప్రెషన్‌లోకి వెళ్లి ఇంట్లో కూర్చుని ఏడుస్తానని అనుకుంటున్నారని.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా క్షేత్రంలోకి వచ్చాను, సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడతానని అన్నారు. ఎమ్మెల్యే ఏకధాటిగా మాట్లాడుతూ ఉండటంతో మేయరు, కార్పొరేటర్లు పలుమార్లు ఆమెను అడ్డుకునే యత్నం చేశారు. అయినా ఆమె ప్రసంగం ఆపకుండా అలాగే కొనసాగిస్తుండడంతో మేయరు, కార్పొరేటర్లు సభను బాయ్‌కాట్ చేసి బయటికి వెళ్లిపోయారు.

రసాభాస

- కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో..
- అవినీతిపై నిలదీసిన ఎమ్మెల్యే ఆర్.మాధవి
- అడ్డుకునే యత్నం చేసిన మేయరు, కార్పొరేటర్లు
- ప్రసంగం ఆపకుండా కొనసాగించిన ఎమ్మెల్యే
- సభ ప్రారంభం కాకుండానే బాయ్‌కాట్ చేసిన మేయరు, కార్పొరేటర్లు



మేయరు సురేశ్‌బాబు వారిస్తున్నా ప్రసంగం కొనసాగిస్తున్న కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయరు సురేశ్ బాబు అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 11గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉంది. ఆ సమయానికి మేయరు వచ్చిన పోడియంపైన తన కుర్చీలో కూర్చున్నారు. కార్పొరేటర్లు, అధికారులూ అందరూ కూడా వచ్చి వారి సీట్లలో కూర్చున్నారు. ఇంతలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి అక్కడకు వచ్చారు. ఆమె కార్పొరేటర్ల పక్కన తనకు ఏర్పాటు చేసిన కుర్చీలో కూర్చోకుండా నేరుగా మేయరు పోడియం పైకి వెళ్లి నిల్చున్నారు. దీంతో మేయరు ఆమెకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి పోడియంపైన నిల్చునే కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై నిప్పులు చెరిగారు. మేయరుపై ప్రత్యక్ష ఆరోపణలు చేశారు. మేయరు స్పందిస్తూ ఆమెను నివారించే ప్రయత్నం చేశారు.



ఎమ్మెల్యే ప్రసంగం ఆపకపోవడంతో సమావేశాన్ని బాయ్‌కాట్ చేసేందుకు నిల్చున్న వైసీపీ కార్పొరేటర్లు

అయినా ఆమె ఏ మాత్రం లెక్కచేయకుండా ఆమె ధోరణిలో ప్రసంగిస్తూనే ఉన్నారు. దీంతో కార్పొరేటర్లు పోడియం వద్దకు వెళ్లి అజెండాలో ఉన్న అంశాలను మాట్లాడాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఏ మాత్రం వినకుండా కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతిపై ప్రసంగాన్ని కొనసాగించారు. దీంతో సభలో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. చివరికి మేయరుతో సహా కార్పొరేటర్లు సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. మరో ఐదు నిమిషాలు ఎమ్మెల్యే ప్రసంగం కొనసాగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కార్పొరేషన్ ఎదుట టీడీపీ నిరసన

కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవికి మేయరు సీటు పక్కన కుర్చీ వేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ శ్రేణులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మేయరుకు, కార్పొరేటర్లుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. మేయరు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి వెళ్లిపోయారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే



ప్రజల సమస్యలు పరిష్కరించడమే టీడీపీ ప్రధాన లక్ష్యమని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి తెలిపారు. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆమె మేయరు పోడియంపై నిల్చుని మాట్లాడారు. గత సర్వసభ్య సమావేశంలో తమకు అవకాశం ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. గతంలో అవకాశమిచ్చి ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. మీ కుర్చీల కోసం తాను రాలేదన్నారు. మహిళలను కించపరచడం సరికాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రానికి వచ్చానని, తాను ఎవరికీ భయపడే ప్రసక్తిలేదన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం చేస్తున్న అవినీతిని బయటపెడతాననే భయంతోనే తన కుర్చీ పక్కన పెట్టారన్నారు. ప్రజలు తనను గెలిపించారని ప్రజల కోసం పాటుపడతామని ఎన్నిసార్లు వాకౌట్ చేసినా ప్రజల కోసం మాట్లాడుతూనే ఉంటానన్నారు. అధికారం, అహంకారం వైసీపీ నేతలకు ఎక్కువైందన్నారు. మహిళలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. తన కుర్చీ లాగేస్తే డిప్రెషన్‌లోకి వెళ్లి ఇంట్లో కూర్చుని ఏడుస్తానని అనుకుంటున్నారు, అది జరిగే పని కాదన్నారు. మహిళలకు రక్షణ లేదని మహిళా కార్పొరేటర్లను ఎస్పీ దగ్గరకు పంపించి రక్షణ కావాలని అడిగించడం దుర్మార్గమన్నారు. ఇన్నాళ్లు కార్పొరేటర్లుగా ఏమీ చేయలేకపోయారని ఇప్పుడైనా ప్రశ్నిస్తే మహిళా కార్పొరేటర్లుకు తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ పెద్దాయనకు కుర్చీలాట అలవాటు అయిందన్నారు. గత వైసీపీ ఎమ్మెల్యేలకు కార్పొరేషన్‌లో గౌరవం ఉంటే.. టీడీపీ ఎమ్మెల్యేలకు మాత్రం గౌరవం అక్కరలేదా అన్నారు.

గత పదేళ్లుగా కార్పొరేషన్‌లో జరుగుతున్న అక్రమాలు బయటపెడతానన్నారు. బుగ్గవంక సుందరీకరణ, రోడ్లు, దేవునికడప చెరువు సుందరీకరణ అని చెప్పారని.. ఇంత వరకు ఏదీ జరగలేదన్నారు. ఎన్ని వర్కులకు పర్మిషన్ తీసుకుని వదిలిపెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. ర్యాటిఫికేషన్‌పై విచారణకు సిద్ధమా అని మేయరుకు సవాల్ చేశారు. దేవునికడప రోడ్డు ఎందుకు ఆగిపోయిందో చెప్పాలన్నారు. అప్సర సర్కిల్ రోడ్ డివైడింగ్ ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. చిన్నచౌకులో చిన్నపాటి వర్షం పడిందంటే రోడ్లన్నీ జలమయం అయ్యే పరిస్థితి ఉందన్నారు. నగరంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, ఇవేమీ మేయరు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయరు తన సొంత కారు పెట్టుకుని కార్పొరేషన్ నిధులు దోచుకుంటున్నారన్నారు. మహిళలను అవమానించే వారు చరిత్రలో బాగుపడేది లేదన్నారు. మేయరు తాను తీసిన గోతిలో తానే పడతాడని స్పష్టం చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలకు గౌరవం అవసరం లేదని ప్రజాసమస్యలపై పోరాడుతూ ప్రజలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేకు గౌరవం ఇచ్చాం.. ఆమె కాపాడుకోలేదు : మేయరు



కడప ఎమ్మెల్యే మాధవికి గౌరవం ఇచ్చాం, అయితే ఆ గౌరవాన్ని ఆమె కాపాడుకోలేకపోయారని మేయరు సురేశ్‌బాబు తెలిపారు. గురువారం కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన అనంతరం మేయరు తన చాంబరులో కార్పొరేటర్లతో కలసి విలేకరులతో మాట్లాడారు. గత సమావేశంలో ఎమ్మెల్యే మాధవికి గౌరవం ఇచ్చి మేయరు సీటు పక్కన కూర్చోబెట్టామని ఆమె ఆ గౌరవాన్ని నిలబెట్టుకోలేకపోయారని అందుకే కుర్చీని కిందకు వేసినట్లు తెలిపారు. అగౌరవపరచాలంటే ఆమె లోపలికి రాకుండా నిరసన తెలిపేవాళ్లమన్నారు. కానీ ఆమెను గౌరవించి లోపలికి రానిచ్చామన్నారు. వైసీపీని ఓడించి టీడీపీకి ప్రజలు పట్టం కట్టారని.. అందరం కలిసిమెలిసి అభివృద్ధి చేసుకోవాలన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉంటాయి కానీ తరవాత ప్రజా సమస్యలపై చర్చించి ప్రజలకు అవసరమయ్యే వసతులు కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఎక్కువ కాలం ప్రతిపక్షంలో ఉన్నామన్నారు. ఏ పార్టీ వారయినా ఎంతో గౌరవం ఇస్తుండేవారమన్నారు. గత సర్వసభ్య సమావేశంలో ఓ మహిళా కార్పొరేటరును ఎమ్మెల్యే మాధవి అవమానకరంగా మాట్లాడారన్నారు. అది కూడా తన సొంత పార్టీ కార్పొరేటరు అన్నారు. ఉమాదేవి ఏ పార్టీకి చెందిన వ్యక్తి అయినా అవ్వచ్చు తమ సహ కార్పొరేటరును అవమానించడం చాలా బాధ కలిగించిందన్నారు. 49వ డివిజన్ కార్పొరేటర్ మహిళ కాదా, ఆమెను ఎమ్మెల్యే ఇష్టమొచ్చినట్లు మాట్లాడవచ్చా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాధవి ఓ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. నియంత పోకడలతో ప్రవర్తించడం సరికాదన్నారు. వందలాది మందితో సమావేశానికి రావడం ఏమిటని ప్రశ్నించారు. రూ.876 కోట్ల నిధులతో రోడ్ల గుంతలు పూడ్చే పనులు చేపట్టారని.. అవి టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టడమేనన్నారు. టీడీపీతో తాను కుమ్మక్కయ్యానని నిందలు వేయడం సరికాదన్నారు. ఆర్.శ్రీనివాసరెడ్డిలా ఏ పార్టీ అధికారంలో ఉన్నా పనుల కోసం కాళ్లు పట్టుకునే వ్యక్తిని కాదన్నారు. ప్రజాసమస్యలపై చర్చించకుండా వాదనలకు దిగడం సరికాదన్నారు. సొంత ఎజెండాపై ఎమ్మెల్యే మాట్లాడడంతోనే కార్పొరేటర్లు బహిష్కరించారన్నారు. మీకన్నా పెద్దపదవిలో ఉన్నానని గర్వంతో ఎమ్మెల్యే మాట్లాడడం తగదన్నారు. గత సమావేశంలో కార్పొరేటరు భర్తలకు కార్పొరేషన్‌లో ఏం పని అని ప్రశ్నించారని.. మరి టీడీపీ నేతలు ఆ సమావేశానికి ఎలా వచ్చారని అడిగారు. రాష్ట్రంలో ఏ కార్పొరేషన్‌లో అయినా ఎమ్మెల్యేలు కిందనే కూర్చుంటారని, మేయరు మాత్రమే పోడియంపై ఉంటారని ఆయన స్పష్టం చేశారు.

సమావేశంలో ఒకే ఒక్కరు

కడప సర్వసభ్య సమావేశం రసాభాస అయి కార్పొరేటర్లు, మేయరు బాయికాట్ చేసి వెనుదిరిగారు. అలాగే కడప ఎమ్మెల్యే మాధవి కార్పొరేషన్‌లో అవినీతిపై నిప్పులు చెరిగి ఆమె కూడా తన ప్రసంగం ముగించుకుని వెళ్లిపోయారు. అయితే టీడీపీకి చెందిన 49వ డివిజను కార్పొరేటరు ఉమాదేవి మాత్రం ఒంటరిగానే సర్వసభ్య సమావేశంలో మిగిలిపోయారు. స్పష్టమైన సమాచారం వచ్చేంత వరకు తాను సమావేశం నుంచి బయటికి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. చివరకు కమిషనర్ పీఏ వచ్చి సమావేశం వాయిదా పడిందని చెప్పడంతో ఆమె కూడా వెళ్లిపోయారు. కాగా.. ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత తిరిగి సమావేశం నిర్వహించాలని మేయరు, కార్పొరేటర్లు చర్చించారు. చివరకు కమిషనర్‌తో చర్చించి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కాగా.. గురువారం జరిగే కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో గొడవలు జరుగుతాయనే ఉద్దేశ్యంతో పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వైసీపీ కార్పొరేటర్లు అందరూ వెళ్లపోవడంతో మిగిలిన టీడీపీ ఒకేఒక్క కార్పొరేటరు ఉమాదేవి

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విస్తరణ పనులకు శంకుస్థాపన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్.. చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు



నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మైలవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. గురువారం తలమంచిపట్నం వద్ద 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విస్తరణ పనులకు వర్చువల్ ద్వారా రాజధాని ప్రాంతంలోని తాలాయపాలెం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. అలాగే మైదుకూరు వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్ లైన్ల అనుసంధాన నిర్మాణ పనులకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. తలమంచిపట్నంలో శిలాఫలకాల ఆవిష్కరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో తలమంచిపట్నంలో రూ.193.30 కోట్లతో 98.17 ఎకరాల్లో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 1 మే 2016న శంకుస్థాపన చేశామన్నారు. ప్రస్తుతం కడప, అనంతపురం జిల్లాల్లో ఉత్పత్తి అయ్యే పవన, సోలార్ విద్యుత్తు గ్రిడ్‌కు అనుసంధానించే పనులకోసం గురువారం శిలాఫలకాన్ని ఆవిష్కరించామన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో పారిశ్రామిక, వ్యవసాయ, గృహావసరాలను తీర్చేందుకు 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విస్తరిస్తున్నారన్నారు. దీని నుంచి 1630 ఎంవీఏ సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా మొత్తం 1397.50 మెగావాట్ల నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తామన్నారు.

ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యుత్తు సబ్‌స్టేషన్ అనుసంధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాలకు కూడా నాణ్యమైన విద్యుత్తును అందించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రధానంగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, పోరుమామిళ్ల, చక్రాయపేట, తదితర ప్రాంతాలకు లోవోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, ట్రాన్స్‌కో సీఈ కృష్ణమనాయుడు, ఎస్ఈలు శ్రీనివాసరావు, విశ్వేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ స్ర్కీనింగ్ పరీక్షలకు సహకరించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద 'క్యాన్సర్‌పై విజయం- స్ర్కీనింగ్‌తో సాధ్యం' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన ర్యాలీని డీఎం అండ్ హెచ్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 వతేదీ నుంచి 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ నిర్ధారన పరీక్షలు నిర్వహిస్తామన్నారు. నోరు, రొమ్ము, గర్భాశయ, ముఖ క్యాన్సర్‌కు సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వచ్చి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. ఈ పరీక్షల వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ నుంచి రక్షించుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేశ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణం, డాక్టర్ రవి, డీఎల్ఏటీవో డాక్టర్ సునీత, డాక్టర్ బాలాంజనేయులు, డాక్టర్ ఉబేదుల్లా, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత క్యాన్సర్ పరీక్షలపై చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ నాగరాజు

జగన్ పాలనలో క్రీడారంగానికి గ్రహణం

● ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.119 కోట్ల స్కాం
● క్రీడారంగ అభివృద్ధికి కూటమి సర్కార్ కట్టుబడి ఉంది ● శాప్ చైర్మన్ రవి నాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అనిమిని రవి నాయుడు

కడప స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో క్రీడారంగానికి గ్రహణం పట్టించారని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆరోపించారు. క్రీడాకారులకు ఎలాంటి సదుపాయాలు కల్పించకపోగా మొత్తం క్రీడారంగాన్ని భ్రష్టుపట్టించారని ధ్వజమెత్తారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం కడప చేరుకున్న ఆయన తొలుత డీఎస్ఏ స్టేడియంతో పాటు ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి తన స్వంత జిల్లా కేంద్రమైన కడపలో సైతం క్రీడారంగాన్ని అభివృద్ధిచేయలేని అసమర్థుడుగా చరిత్రలో మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలన అంతిమ దశలో ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడలను రాజకీయ స్వప్రయోజనాకోసం ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఆ మేరకు సుమారు రూ.119 కోట్ల నిధులను అడ్డగోలుగా దోచుకున్నారన్నారు. దీనిపై విచారణ సాగుతోందని, నిజాలు నిగ్గుతేలగానే దోషులను వదిలేప్రసక్తే లేదన్నారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆ కోవలో దేశంలోనే అత్యుత్తమంగా మన రాష్ట్రంలో ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించామన్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు రాణించేలా భారీగా ప్రోత్సాహకాల పెంపు చేశామన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డీఎస్ఏల పరిశీలన, అలాగే కేవీకే నిర్మాణాల పురోగతిపై అధ్యయనం చేస్తున్నామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన కేవీకేలు, మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్డీవో జగన్నాథ్‌రెడ్డి, టీడీపీ యువ నేత ఆర్.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జనసేన నేత తుంగా రమణయ్య, డీఎస్ఏ కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్పీగా విద్యాసాగర్ నాయుడు



కడప (క్రైం), నవంబరు7(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా అన్నమయ్యజిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా ప్రజలకు తెలియడం కోసమే భాత్యతలు స్వీకరించామన్నారు. వర్రా రవీంద్రరెడ్డిని పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు.

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేయకుండా 41నోటీసులు ఇవ్వడం, అనంతరం ఇతను పోలీసులకు దొరకకుండా తప్పించుకోవడాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఎస్పీ హర్షవర్ధన్‌రాజును బదిలీ చేయడంలో పాటు చిన్నచౌక్ సీఐ తేజమూర్తిని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

శాంతిభద్రతల పరిరక్షణకు సమష్టిగా కృషిచేయాలి

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సమష్టిగా కృషిచేయాలని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నారు కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఎలాంటి సమస్యలు గుర్తించినా వెంటనే ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులను పెట్టేవారిపై నిఘా ఉంచాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వద్దన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్హులందరికీ 3 ఉచిత సిలిండర్లు

● జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దీపం పథకం-2 ద్వారా అర్హులైన ప్రతి వినియోగదారునికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో దీపం పథకం-2పై జాయింట్ కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత నెల 31వతేదీ నుంచి దీపం పథకం-2 రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం అయిందన్నారు. ఈ పథకం కింద అర్హత కలిగిన కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామన్నారు. నిబంధనల మేరకు అక్టోబరు 29వ తేదీ నుంచి బుకింగ్స్ ప్రారంభించి 31 వతేదీ నుంచి గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచిత సిలిండర్ అందుతుందన్నారు. వినియోగదారునికి ఆధార్ నంబరు కలిగి, బియ్యం కార్డు, యాక్టీవ్ ఎల్పీజీ కనెక్షన్ ఉండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉండేవారు అనర్హులన్నారు. ఉచిత గ్యాస్‌కు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే వారి ఏజెన్సీ దగ్గర లేదా 1967 టోల్ ఫ్రీ నెంబరులో సంప్రదించాలన్నారు. లేదా జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంతో పాటు సంబంధిత సచివాలయాల్లో తెలియజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్, డీఎస్ఓ పోర్టల్ ద్వారా రైస్‌కార్డు నెంబరు తెలిపి అర్హత పరిశీలించుకోవాలన్నారు.

ఎన్నికల్లో పెద్దాయన సహకరించారు : టీడీపీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో టీడీపీకి పెద్దాయన సహకరించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కార్పొరేషన్ ఎదుట ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో పెద్దాయన లోపాయికారి ఒప్పందం చేసుకున్నారన్నారు. అయితే ఒక నెల నుంచి ఏమి వ్యాధి వచ్చిందో కానీ అదోరకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మొదటి సర్వసభ్యసమావేశానికి పెద్దాయన రాలేదన్నారు. తమకు సహకరించాడని వైసీపీ వారికి తెలిసిపోయిందనే భయంతో నాటి సమావేశానికి రాలేదని.. అయితే తన ఉనికి కోల్పోతున్నానని ఇప్పుడు భయపడుతున్నారన్నారు. ఈ రోజు సమావేశం పెట్టి కక్కుర్తి పడి వ్యవహంచారన్నారు. పెద్ద పాలకవర్గం ఉండి ఒక్క మహిళా ఎమ్మెల్యే వస్తే వణుకు పుట్టి వెళ్లిపోయారని చెప్పారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ గత సమావేశంలో తవకు పోడియంపై కుర్చీలు ఏర్పాటు చేశారన్నారు. సమస్యలపై మాట్లాడామని చెప్పారు. ఈ రోజు తన కుర్చీని తీసి కిందకు వేశారన్నారు. అయితే ఈ కుర్చీ కోసం కాదని దీని కన్నా పెద్దకుర్చీ ఎమ్మెల్యేగా తనను గెలిపించారన్నారు. అవినీతి తిమింగళాల భరతం పడతామన్నారు.

గురి పెడితే.. పతకమే...



● మెరిసిన ప్రొద్దుటూరు ఆణిముత్యం ● రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తున్న మహమ్మద్ ఉబైద్

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కఠోర దీక్ష.. పట్టుదల... ఏకాగ్రత... అలుపెరుగని సాధన... లక్ష్యంపై గురి ఇలా అన్ని లక్షణాలు అందిపుచ్చుకుని బరిలో దిగితే పతకాల పంటే. ఒకపక్క చదువు, మరోపక్క ఎంచుకున్న క్రీడపై ఆసక్తి పెంచుకుంటున్నాడు. రైఫిల్ షూటింగ్ క్రీడలో ప్రావీణ్యం పొంది మూడేళ్లలో తొమ్మిది స్వర్ణపతకాలు సాధించి ఆణిముత్యంలా నిలిచాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నాడు. పిల్లల ఆసక్తి బాల్యంలో గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారని నిరూపిస్తున్నాడు షేక్ మహమ్మద్ ఉబైద్.

కుటుంబ నేపథ్యం

ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని రాజరాజేశ్వరి కాలనీకి చెందిన షేక్ జాకీర్, అఫ్సానాభాను దంపతులకు ఇద్దరు కుమారులు. ఇతను పెద్ద కుమారుడు. తల్లి గృహిణి. తండ్రి ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఉబైద్ శ్రీ చైతన్య స్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు.



ఏపీ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ మేనేజర్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా ఒకేసారి అందుకున్న నాలుగు స్వర్ణాలు (ఫైల్)

గురి పెట్టాడంటే...

2021 నుంచి జార్జిక్లబ్‌లో రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న ఉబైద్ 2022 సంవత్సరం రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓపెన్‌సైట్ కేటగిరీ సబ్‌యూత్, యూత్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు.

- 2022లో ఎస్‌జీఎఫ్‌ఐ తరపున రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-19 కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. ఢిల్లీలో జరిగే నేషనల్ మ్యాచ్‌కు సెలెక్టు అయ్యాడు.
- 2023 జూన్‌లో ఢిల్లీలో జరిగిన నేషనల్ కాంపిటీషన్‌లో పాల్గొన్నాడు.
- 2023లో ఎస్‌జీఎఫ్ తరపున రాజమండ్రిలో నిర్వహించిన స్టేట్‌లెవెల్ కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-19 కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. భోపాల్‌లో జరిగే మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.
- 2023 డిసెంబరులో భోపాల్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.



సాధించిన పతకాలు.. తండ్రి షేక్ జాకీర్‌తో ఉబైద్

- 2024 ఆగస్టు నెలలో రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున హైదరాబాదులో నిర్వహించిన స్టేట్‌లెవెల్ పోటీల్లో ఓపెన్‌సైట్ కేటగిరీలో సబ్‌యూత్, యూత్, జూనియర్ మెన్, మెన్ కేటగిరిరీలలో నాలుగు బంగారు పతకాలు సాధించాడు.
- 2024 అక్టోబరులో ఎస్‌జీఎఫ్‌ఐ తరపున రాజమండ్రిలో నిర్వహించిన స్టేట్‌లెవెల్ కాంపిటీషన్‌లో ఓపెన్‌సైట్ అండర్-17 కేటగిరీలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

దేశం తరపున ఆడాలన్నదే లక్ష్యం



జీవితకాలంలో ఒక్కసారైనా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరపున క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలన్నదే నా ఆశయం. ఒలింపిక్స్‌లో ఆడాలనే తపన నాలో కసిని పెంచుతున్నది. దేశానికి పేరుకు తీసుకురావాలన్నది నా కోరిక. ఈ ఏడాది డిసెంబరు 25 నుంచి భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. నేను ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాను. ప్రతి రోజూ ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు రైఫిల్ షూటింగ్ సాధన చేస్తాను. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు కావడంతో ప్రస్తుతం రోజుకు రెండు గంటల సమయం కేటాయిస్తున్నాను. పదవ తరగతి తర్వాత విజయవాడ సమీపంలోని ఉయ్యూరులో ఉన్న విశ్వశాంతి జూనియర్ కళాశాలలో చేర్పించాలని మా నాన్న నా ఆశయ సాధనకు సహకరిస్తున్నారు. అందుకు కారణం ఆ కళాశాలలో రైఫిల్ షూటింగ్ ఉండడమే. కోచ్ రాఘవేంద్ర శిక్షణతో క్రీడల్లో అరంగేట్రం చేశాను. 2021 నుంచి ఇప్పటి వరకు వివిధ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో పాల్గొని తొమ్మిది స్వర్ణ పతకాలు సాధించాను.

- షేక్ మహమ్మద్ ఉబైద్, రైఫిల్ షూటర్

తాళ్ళపాక ఇండస్ట్రియల్ భూములపై ఏపీఐఐసీకి అధికారాలు బదలాయింపు

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం మదనగోపాలపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 46.16 ఎకరాల పారిశ్రామిక భూముల అజమాయిషీని గ్రామ పంచాయతీ నుంచి ఏపీఐఐసీకి బదలాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పారిశ్రామిక అవసరాల కోసం తాళ్లపాక గ్రామానికి చెందిన 46.16 భూములు సిద్ధమయ్యాయి. ఇవి మదనగోపాలపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. ఈ భూములను అభివృద్ధి చేసి పరిశ్రమల స్థాపన కోసం పనులు ప్రారంభించేందుకు కొన్ని గ్రామ పంచాయతీలకు ఉన్న అధికారాలను పారిశ్రామిక సంస్థ (ఏపీఐఐసీ)కు బదలాయించాల్సి ఉంది. తాళ్లపాక రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 1270/1, 1273, 1279, 1280, 1281, 1282లోని మొత్తం 46.16 ఎకరాల ప్రభుత్వ భూములు ఏపీఐఐసీకి పరిశ్రమల స్థాపన కోసం సిద్ధం చేశారు. అయితే పంచాయతీరాజ్ చట్టం మేరకు ఈ భూముల అజమాయిషీ వ్యవహారాలు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. పరిశ్రమల కోసం భూములను అభివృద్ధి చేసి, పరిశ్రమలు ప్రారంభించిన తరువాత వచ్చే ఆదాయాన్ని మదనగోపాలపురం గ్రామ పంచాయతీ, ఏపీఐఐసీలు 50:50 దామాషాతో పంచుకునే షరతుతో ఈ భూములపై ఉన్న పంచాయతీ అధికారాలను ఏపీఐఐసీకి బదలాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ గ్రామ పంచాయతీ కూడా గతంలో తీర్మానం చేసింది. దీంతో పంచాయతీలకున్న అధికారాలను ఏపీఐఐసీకి బదలాయిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

రాయచోటిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా నుంచి రాజు హాకీ అకాడమీ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగం నుంచి రెడ్డిబాలాజీ, సాయి, జస్వంత్, బాలికల విభాగం నుంచి నాగతేజ, వేణుమాధవి, చైతన్యశ్రీ పాల్గొనగా వారిలో జాతీయ స్థాయి జట్టుకు సాయి, చైతన్యశ్రీలు రెండు విభాగాల్లో ఎన్నికైనట్లు జిల్లా హాకీ అకాడమీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు, జిల్లా హాకీ కోచ్ చంద్ర, రాజు స్కూల్స్ హెడ్‌మాస్టర్ ఉమామహేశ్వరి తెలిపారు. వీరు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆడనున్నారు. వీరితో పాటు అండర్-14, అండర్-19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల్లో శ్రీనిధి, చైత్ర, బాలుర విభాగంలో హర్ష, వర్మ, జగన్, శౌనక్, వెంకటేశ్, నందినిలు వైజాగ్, కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాజు హాకీ అకాడమీ నుంచి 14 మంది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఆడుతున్నట్లు తెలియజేశారు.

యువకుడు ఆత్మహత్య

నందలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తపి గ్రామంలో నువ్వుల సతీష్ (25) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. మంగళవారం ఇంట్లోకి వెళ్లిన యువకుడు రెండు రోజులుగా బయటకు రాలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. వారు ఇంటికి వెళ్లి చూడగా సతీష్ ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

కాగా తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని మృతుడు సూసైడ్ నోట్‌లో రాశాడు. మృతుడి తల్లిదండ్రులు జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లారు.

ఆర్‌అండ్‌బీ రిటైర్డు ఈఈపై విచారణ

- అనంతపురానికి చెందిన ఇంజనీర్లపై కూడా
- విజిలెన్స్ విచారణలో వెలుగులోకి పలు అక్రమాలు
- ఏడాదికి పైగా చర్యలు లేకుండా వెనకేసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం

కలికిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో కడప ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పని చేసి రిటైర్ అయిన పి.రవీంద్రబాబుపై విచారణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవీంద్రబాబుతో పాటు అదే సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేసిన మరో 8 మంది ఇంజనీర్లపై కూడా ప్రభుత్వం బుధవారం విచారణకు ఆదేశించింది. ఆ జిల్లాలోని పెనుగొండ-ముదిగుబ్బ-డొరిగల్లు మధ్య 28వ కి.మీ నుంచి 68వ కిలోమీటరు వరకు జరిగిన రోడ్డు విస్తరణ పనుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం రిటైర్ అయిన కడప ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రబాబుతో పాటు ఆ రోడ్డు పనులు పర్యవేక్షించిన మరో ఎనిమిది మంది ఇంజనీర్లు వివిధ రకాల అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ తేల్చింది. రవీంద్రబాబుతో సహా ఈ రహదారి విస్తరణ పనులను పర్యవేక్షించిన ప్రస్తుతం బద్వేలు డీఈఈగా పనిచేస్తున్న బి.ఎస్. సలీమ్, అనంతపురం డీఈఈగా ఉన్న ఎస్. బాల కాటమయ్య, కల్యాణదుర్గం ఈఈ వి.రాజగోపాల్, కల్యాణదుర్గం డీఈఈ జి.వెంకటసుబ్బయ్య, పెనుగొండ ఏఈఈ ఎ.వెంకటేష్, విజయవాడ ఎయిర్‌పోర్ట్ అథారిటీ డీఈఈ డి.పద్మజ, ధర్మవరం ఏఈ ఆర్.రవీంద్ర, విజయవాడ ఎన్‌హెచ్ ఈఈ జి.సంజీవరాయుడులపై విజిలెన్స్ అధికారులు పలు అభియోగాలను నమోదు చేశారు. వీరంతా కుమ్మక్కై రహదారి పనుల్లో అనేక రకాల అక్రమాలకు పాల్పడ్డట్టు నిర్ధారించింది. ఈ తొమ్మిది మంది ఇంజనీర్లపై తగు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ 2023 మార్చి 20వ తేదీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే అప్పటి ప్రభుత్వం విజిలెన్స్ సిఫారసులకు సంబంధించిన నివేదికపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా పక్కన పెట్టింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ నివేదికను వెలికితీసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొనేందుకు విచారణకు ఆదేశించింది. ప్రాథమికంగా విజిలెన్స్ గుర్తించి ప్రస్తావించిన వైఫల్యాలపై తగిన వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీరు సంజాయిషీలు పంపుకోవడానికి 10 రోజుల గడువిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే వేర్వేరుగా పది జీవోలను బుధవారం విడుదల చేశారు. కడప ఈఈ రవీంద్రబాబు రిటైర్ అయినందున పెన్షన్ రూల్స్ మేరకు చర్యలు తీసుకోవాలని మరో జీవోలో ఆదేశించారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దీపం సిలిండర్

● జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దీపం-2 పథకం ద్వారా ఉచిత సిలిండర్ రాయితీ లభిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 1వ తేదీ నుంచి దీపం-2 పథకం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో శాసనసభ సభ్యులందరూ, ప్రజాప్రతినిధుల ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించారని, దీపం-2 పథకానికి జిల్లా వ్యాప్తంగా మంచి స్పందన వస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 33 వేలకు పైగా సిలిండర్లు బుక్ చేసుకున్నారని అందులో దాదాపు 21 వేల సిలిండర్లు డెలివరీ కూడా చేశారన్నారు. సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే మొబైల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. మెసేజ్ రావడం లేదని కొంతమంది నుంచి ఫిర్యాదు అందుతోందని, ఎవరికైనా ఏదైనా ఫిర్యాదు ఉంటే 1967 నెంబర్‌కు ఫోన్ చేసి ఎల్పీజీ నెంబర్ లేదా ఫోన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్, రైస్‌కార్డు నెంబర్ తెలపవచ్చన్నారు. లేదా సచివాలయాల్లో పీజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సంబేపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా వేగవంతంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించి సూచనలు, సలహాలు చేశారు. ఆపార్‌ఐడీ ప్రగతిపై సమీక్షించారు. వీఆర్‌వో, పంచాయతీ సెక్రటరీలు ప్రతి పాఠశాలను సందర్శించి, బర్త్ సర్టిఫికెట్లు లేనివారిని నో అవైలబిలిటీ సర్టిఫికెట్ ఇచ్చి బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని, అనంతరం విద్యార్థుల ఆధార్ అప్డేషన్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి లేఅవుట్ వారీగా దశలవారీ ప్రగతిపై మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష చేశారు. మంజూరైన ప్రతి ఇంటిని మూడు రోజుల్లోపు జియో ట్యాగ్ చేయాలని తెలిపారు. అనంతరం సంబేపల్లె అంగన్వాడీ ప్రీ స్కూల్‌ను తనిఖీ చేశారు. అంగన్వాడీ స్కూల్‌ను మరింత మెరుగ్గా నిర్వహించాలని టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్‌లను ఆదేశించారు. సంబేపల్లె ప్రకాశ్‌నగర్ కాలనీలో ఒకే పట్టాను ఇరువురు వ్యక్తులకు ఇచ్చిన అంశంలో స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి రికార్డులను, స్థలాన్ని పరిశీలించారు. స్థలానికి పక్కాగా కొలతలు వేసి అందజేయాలని, మరొక వ్యక్తికి అర్హతను బట్టి వేరే ప్రాంతంలో ఇంటి పట్టా మంజూరుకు సిఫారసు చేయాలని అధికారులను ఆదేశించారు.

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో హైవే నుంచి కేజీబీవీ స్కూల్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల వరకు 287 మీటర్ల మేర నిర్మించిన సీసీ రోడ్డును కలెక్టర్ పరిశీలించారు. రోడ్ల నిర్మాణం నాణ్యతలో ఎక్కడ రాజీపడరాదని అధికారులకు సూచించారు. పనులన్నీ డిసెంబరులోగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, డీపీవో బలరామిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో రామచంద్ర, ఎంఈవోలు, హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌వోలు, పంచాయతీ సెక్రటరీలు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 837 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపైనే సూర్యుని వేడిని విద్యుత్‌గా మార్చుకోవడం వల్ల ఆర్థికంగా కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, నెడ్ క్యాప్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్లారెడ్డి, ఎల్‌డీయం ఆంజనేయులు, కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్ బారతి, మల్లూరు పంచాయతీ సర్పంచ్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

మహిళ మృతిపై ఉన్నతాధికారుల విచారణ



మృతురాలి కుమారుడిని విచారిస్తున్న అధికారులు

పీలేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో గత నెల 30వ తేదీ మహిళ మరణించిన ఉదంతంపై జిల్లా రెవెన్యూ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గురువారం విచారణ చేశారు. కేవీపల్లె మండలం గోరంట్లపల్లెకు చెందిన సి.కృష్ణమ్మ (55) ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో మరణించడం, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందన్న వామపక్ష సంఘాల ఆరోపణలు, ఫిర్యాదులతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రి వైద్యులు, రాయచోటిలోని ఏరియా ఆసుపత్రి వైద్యులతో విచారణ బృందాన్ని నియమించారు. విచారణ బృందం గురువారం ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో విచారణ జరిపింది. మృతురాలి కుమారుడు నాగేశ్వర, ఆమెకు వైద్యం అందించిన డాక్టర్ వసీంలను విచారించారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, ఐసీయూ విభాగాన్ని తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిర్వహించామని, విచారణ సారాంశాన్ని నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

ఏపీఎస్‌బీసీఎల్‌లో పాత వస్తువుల విక్రయం



వేలం వేస్తున్న డిపో మేనేజర్, అధికారులు

మదనపల్లె టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపో పరిధిలోని 69 ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న పాత వస్తువుల విక్రయం ద్వారా రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం పుంగనూరు రోడ్డులోని డిపోలో పాత ఫ్రీజర్లు, ఇన్వర్టర్, బ్యాటరీలు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్‌చెస్ట్, స్కానర్లను బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 27 మంది రూ.5 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. వీటిలో 44 క్యాష్ కౌంటింగ్ మిషన్లు, 21 క్యాష్ చెస్ట్‌లను వేలంలో పలువురు పాడుకున్నారు. దీంతో రూ.2,02,635 ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని ఏపీఎస్‌బీసీఎల్ ఖాతాకు జమ చేస్తామని డిపో మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. మిగిలిపోయిన ఫ్రీజర్లు, బ్యాటరీ ఇన్వర్టర్ల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి ఆదేశాలతో తిరిగి వేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆదికేశవులు, సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్, స్టోర్ ఆఫీసర్ నరేంద్ర పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదిక

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదికను మండల రెవెన్యూ అధికారులు అందజేశారు. మండలంలోని అమ్మచెరువు మిట్ట వద్ద తెట్టు, అంగళ్లు రెవెన్యూ పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో 'దర్జాగా అమ్మేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది.

దీనిపై జిల్లా అధికారులు స్పందించి దీనికి సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

సర్టిఫికెట్ కరెక్షన్‌కు డబ్బుల వసూళ్లు

● ఒక్క పనికి రూ.350 నుంచి రూ.750 ● మున్సిపల్, సచివాలయాల్లో ఇదీ పరిస్థితి

మదనపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో బర్త్ సర్టిఫికెట్‌లో కరెక్షన్ కోసం మున్సిపల్, పంచాయతీ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. వీరు పడే ఇబ్బందులు ఒక ఎత్తయితే, అందుకయ్యే ఖర్చు కూడా తడిసిమోపెడవుతోంది. ఇందుకోసం మదనపల్లె మున్సిపల్ కేంద్రానికి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో క్యాష్‌కౌంటర్ ముందు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రద్దీగా ఉంటోంది. అలాగే రెండు వార్డు సచివాలయాలు కూడా ఇదే తరహాలో కిక్కిరిసిపోతున్నాయి. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు మున్సిపల్, సచివాలయ సిబ్బంది వసూళ్ల పర్వానికి తెరలేపారు. దరఖాస్తు నింపడం నుంచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్, ఆమోదం వరకూ బాధితులకు చేతి చమురు వదిలిపోతోంది. సాధారణంగా జనన ధ్రువీకరణ పత్రంలో ఏదైనా కరెక్షన్ చేయాలంటే రూ.100 చలానా రూపంలో మున్సిపాలిటీకి చెల్లిస్తే అక్కడ మనకు కావాల్సిన సేవలు పొందవచ్చు. కానీ అపార్ ఐడీతో రద్దీ పెరగడంతో వీరు ఫీజు కూడా భారీగా పెంచేసినట్లు చెబుతున్నారు. రూ.వందతో పోయే పనికి రూ.350 నుంచి రూ.750 వరకు ఖర్చు అవుతోందని బాధితులు వాపోతున్నారు. మొదటగా తమకు కావాల్సిన కరెక్షన్‌ను దరఖాస్తులో పూరించి సచివాలయంలో అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలో బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నప్పుడు ఇన్షియల్‌తో ఉండగా తాజాగా విద్యాసంస్థలు సర్‌నేమ్‌తో సర్టిఫికెట్ అడుగుతున్నారు. ఈ క్రమంలో సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకెళితే కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు.

వీటిని మున్సిపల్ కార్యాలయం నుంచి త్యాగరాజు, కోటగడ్డ, చంద్రవిలాస్, కృష్ణానగర్ సచివాలయాలకు పంపుతున్నారు. అక్కడ అప్‌లోడ్ చేయగానే, మున్సిపల్ కార్యాలయంలో అప్రూవల్ ఇస్తే, తమకు కావాల్సిన ప్రింట్ అవుట్ తీసుకోవచ్చు. ఈ ప్రక్రియ వారం, పది రోజులు పడుతుందని చెబుతుండగా అవసరం మేరకు సొమ్ములు తీసుకుని ఇచ్చేస్తున్నారు. సర్టిఫికెట్‌లో ఒకటి కంటే ఎక్కువ కరెక్షన్ ఉంటే, ఒక్కోదానికి రూ.350 నుంచి రూ.1000 తీసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇలా వంద రూపాయలతో పోయే పనిని రూ.350 నుంచి రూ.750, ఆపై వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఎక్కువ డబ్బులు వసూలు చేసినట్లు ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. ఒక్కో కరెక్షన్‌కు రూ.100 అది కూడా మున్సిపాలిటీలో చలానా రూపంలో చెల్లించాలి. అంతకుమించి వసూలు చేస్తే క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె



మున్సిపల్ కార్యాలయంలో క్యూకట్టిన జనాలు



చంద్రవిలాస్ సచివాలయంలో కరెక్షన్ కోసం ప్రజల రద్దీ

వేంపల్లెకు వస్తే ట్రాక్టర్లతో తొక్కిస్తాం

● పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లకు ఓ నేత హుకుం

పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ట్రాక్టర్లు వేంపల్లె వద్దనున్న పాపాఘ్ని ఇసుకకు రాకూడదని, వస్తే ట్రాక్టర్లతో తొక్కిస్తామని ఓ నాయకుడు బెదిరింపులకు దిగారు. కొన్నిరోజులుగా పాపాఘ్ని నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను పులివెందులకు చెందిన కొంతమంది తరలిస్తున్నారు. కానీ గురువారం వేంపల్లెకు చెందిన ఓ నాయకుడు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్లు మళ్లీ ఇసుకకు వస్తే ట్రాక్టర్లతోనే తొక్కిస్తామని వారిని బెదిరించారు. అప్పటికే ట్రాక్టర్లలో నింపిన ఇసుకను అన్‌లోడ్ చేయించి వెనక్కు పంపారు. వేంపల్లెకు చెందిన ట్రాక్టర్లు కూడా ఇసుక తీసుకెళ్లాలంటే రూ.100 గేటు, కూలీలు రూ.500 చెల్లించాలని చెప్పారు. దీంతో గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో పలువురు డ్రైవర్లు పులివెందులలోని కడపరోడ్డులో ట్రాక్టర్లను నిలిపి ఆందోళన చేశారు. ఇదే సమయంలో వేంపల్లెకు చెందిన ట్రాక్టర్లు ఇసుకతో రావడంతో వాటిని పులివెందులలోకి వెళ్లనివ్వకుండా ఆపేశారు. తమను వేంపల్లెకు రానివ్వనప్పుడు.. వేంపల్లె ట్రాక్టర్లు పులివెందులలోకి ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. అనంతరం 12గంటల ప్రాంతంలో వేంపల్లెకు చెందిన ఇసుక ట్రాక్టర్లను వెనక్కి తిప్పి పంపారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో సమస్య పరిష్కరించుకుంటామని పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లు తెలిపారు.

పులివెందుల వాసులు ఇసుక తెచ్చుకోవాలంటే ఇటు పాపాఘ్నికి గాని, అటు చిత్రావతికి గాని వెళ్లాల్సి ఉంటుంది. చిత్రావతికి వెళ్లాలంటే చాలా దూరం. దీంతో పాపాఘ్నికే వెళుతుంటారు. అయితే అక్కడి నాయకులు వీరిని అడ్డుకోవడం వివాదానికి కారణం అవుతోంది.



ఆందోళనకు దిగిన పులివెందుల ట్రాక్టర్ డ్రైవర్లు



పులివెందులలో నిలిపివేసిన వేంపల్లె ఇసుక ట్రాక్టర్లు

టెక్స్‌టైల్‌పార్కు, జలాశయాల పరిశీలన



సోలార్‌ప్లాంట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆది

మైలవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టెక్స్‌టైల్ పార్కును, మైలవరం జలాశయాన్ని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గురువారం పరిశీలించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీతో కలిసి టెక్స్‌టైల్ పార్కును పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. చేనేత సంఘ నేతలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే టెక్స్‌టైల్ పార్కును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం మైలవరం జలాశయాన్ని పరిశీలించి నీటి నిల్వపై ఆరా తీశారు. పొన్నం పల్లి వద్దనున్న సోలార్ ప్లాంట్‌ను పరిశీలించి.. పవర్ ప్రాజెక్ట్ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సోలార్, జలాశయ, టెక్స్‌టైల్ పార్కు అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య భర్త మృతి





జానా శివప్రసాద్, శైలజ మృతదేహాలు

వల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని వల్లూరు మండల కేంద్రానికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కడపకు చెందిన జానా శివప్రసాద్ (40) అతని భార్య శైలజ (35) ఇరువురూ ద్విచక్ర వాహనంలో కమలాపురం మండలం చదిపిరాళ్లకు వెళ్లి... తిరిగి కడపకు వస్తుండగా వల్లూరుకు సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు రాగానే కడప నుంచి కమలాపురం వెళుతున్న లారీ (కంటైనర్) ఢీకొన్న సంఘటనలో శైలజ సంఘటనాస్థలిలో మృతి చెందింది. కొన ఊపిరితో ఉన్న భర్త శివప్రసాద్‌ను 108లో కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. జానా శివప్రసాద్ సిద్దవటంలో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా... భార్య ఇంటి వద్ద గృహిణి. వీరికి ఇద్దరు పిల్లలు విఘ్నేశ్ (8), లక్ష్మి (12) ఉన్నారని పోలీసులు తెలిపారు .ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

నిప్పంటించుకుని మహిళ మృతి



పులివెందుల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డు ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న యాదవ్‌గుంట రాజేశ్వరి (48) గురువారం నిప్పంటించుకుని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. పులివెందులకు చెందిన సదాశివారెడ్డితో ఆమెకు 30 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత పదేళ్ల నుంచి మానసికంగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిప్పంటించుకుంది. భర్త ఇంటికి వచ్చి చూడగా.. మంటలు వస్తుండడంతో అక్కడికి వెళ్లి మంటలు అదుపు చేశారు. చికిత్స కోసం ఆమెను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సలు చేసి అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు రెఫర్ చేయడంతో వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

చీటీలపేరుతో మోసం కేసులో...
ఇరువురికి జైలుశిక్ష, జరిమానా

● శిక్షపడిన వారిలో మాజీ హోంగార్డు

కడప (క్రైం)నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ చీటీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేసి తిరిగి వారికి ఇవ్వకుండా మోసం చేసిన కేసులో ఇరువురికి నాలుగేళ్ల జైలు శిక్ష రూ.22వేలు జరిమానా విధిస్తూ సెషన్స్ జడ్జి ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప రాజారెడ్డి వీధికి చెందిన రెడ్డి నాగులు అతడి భార్య లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలిసి ప్రైవేట్ చీటీల వ్యాపారాలు చేస్తూ పలువురి నుంచి డబ్బులు తీసుకొని తిరిగి వారికి ఇవ్వకుండా మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మాజీ హోంగార్డు రెడ్డి నాగులు, అతడి భార్య లక్ష్మీదేవితో పాటు పాలెం శారద, వెంకట సుబ్బరాయుడు అలియాస్ సంజీవరాయుడు, రెడ్డిశేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసు విచారణలో భాగంగా గురువారం రెడ్డినాగులు, లక్ష్మీదేవిలపై నేరం రుజువు కావడంతో జడ్జి ఇరువురికి నాలుగేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి రూ.11వేలు చొప్పున 22వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ముగ్గురిపై కేసును కొట్టేశారని తెలిపారు. ఈ కేసును పీపీ బాలజీ వాదించినట్లు తెలిపారు.

చీటింగ్ కేసులో భార్యభర్తలకు ఏడేళ్లు జైలు

కడప(క్రైం)నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్స్ నడుపుతూ 33 మంది నుంచి రూ.31 లక్షలు వసూళ్లు చేసి మోసం చేసిన భార్యభర్తలకు ఏడు సంవత్సరాల జైలుశిక్ష, 22వేలు జరిమానా విధిస్తు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప బాలజీనగర్‌కు చెందిన మల్లికార్జునరెడ్డి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న భార్య హరితమ్మతో కలిసి 2019లో ప్రైవేట్ చీటీలు నిర్వహించారు. 33 మంది నుంచి రూ.31లక్షలు వసూళ్లు చేసి తిరిగి చీటీలు వేసిన వారికి చెల్లించకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు 2019లో భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసుకు సంబంధించి విచారించిన జడ్జి వారిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలుశిక్షతో పాటు ఇద్దరికి కలిపి రూ.22 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసును పీపీ బాలాజీ వాదించినట్లు తెలిపారు.

చిట్స్ పేరుతో మోసం చేసిన వ్యక్తికి..

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిట్స్ పేరుతో 92 మందిని మోసం చేసిన కేసులో ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన వై.శ్రీనివాసులరెడ్డికి ఏడేళ్ల జైలుశిక్ష రూ.18వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన వై.శ్రీనివాసులరెడ్డి చిట్స్ నడుపుతూ మోసం చేయడంతో 92 మంది బాధితులు అతనిపై ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు విచారణలో నిందితుడికి శిక్ష విధించినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

భారీగా పట్టుబడ్డ రేషన్ బియ్యం అక్రమ నిల్వలు

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండిబజార్ రోడ్డులోని వాసవీ ట్రాన్స్‌పోర్టు సమీపంలో గదుల్లో రేషన్‌బియ్యం అక్రమ నిల్వలను సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. గురువారం రాత్రి అక్రమ నిల్వలపై సమాచారం రావడంతో మండిబజార్‌లోని షాపింగ్‌కాంప్లెక్స్ గదులను పరిశీలించారు. ఈ గదుల యజమానులు ఎవరని విచారిస్తున్నారు. ఇందులో అక్రమ బియ్యం వున్నట్లు కొందరు ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లై డిటీ మల్లికార్జున, ఆర్ఐ సాయిప్రసాద్ రూరల్ ఎస్ఐ రఫీ పరిశీలించారు. రాత్రి పొద్దుపోవడంతో శుక్రవారం వీటిని సీజ్ చేయనున్నట్లు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● అభివృద్ధి ప్రణాళికలను జాగ్రత్తగా తయారు చేయాలి ● డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ

కడప రూరల్, అక్టోబర్ 7,(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ కోసం రెండురోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు సద్వినియోగం చేసుకుని.. 2025-26 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ (జడ్పీ సీఈవో) ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపాల్(డీపీవో) రాజ్యలక్ష్మిలు పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన రెండో బ్యాచ్ జిల్లాస్థాయి టాట్స్ శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ)నిధులతో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో జీపీడీపీ ప్రణాళిక తయారీపై శిక్షణ ఇవ్వడం జరు గుతుందన్నారు. ఈమేరకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో రెండో బ్యాచ్ శిక్షణను 7,8 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ పట్ల అశ్రద్ధ వహించరాదన్నారు. ఈ శిక్షణ ద్వారా క్షేత్రస్థాయి వరకు సరైన అవగాహన లభిస్తేనే రాబోయే సంవత్సరం ప్రణాళిక సక్రమంగా తయారు చేయటం, అమలు చేయటం వీలుపడుతుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధుల విషయంలో మనం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. ఇందుకోసం ఈశిక్షణా కార్యక్రమాన్ని ప్లాన్ తయారీ, అమలు, ఆడిట్‌ల ప్రాధాన్యతపరంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. శిక్షణను పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థకు చెందిన అధికారులు అబ్జర్వర్లుగా హాజరై పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ శిక్షణలను ముఖ్యంగా గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలో 2025-26 సంవత్సరానికి తయారు చేయాల్సిన ప్రణాళికలను సమర్థవంతంగా తయారు చేసి తద్వారా పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధుల విడుదలలో సమస్యలు రాకుండా చూసుకునే విధంగా అవగాహన కోసం ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి కాగానే మండలస్థాయిలలో నవంబర్ 12 నుంచి 16 వరకు ప్రజాప్రతినిధులకు, అధికారులకు, లైన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు శిక్షణ ఉంటుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని... తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. శిక్షణలో డీఎల్‌పీవోలు, డీపీఆర్‌సి కో-ఆర్డినేటర్ భాష్కర్, ఏవో బండపల్లి నాగభూషణం, సురేష్, ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్‌ను పరిశీలించిన శాప్ ఛైర్మన్



స్పోర్ట్స్ స్కూల్ వంటశాలలో పరిశీలిస్తున్న శాప్ ఛైర్మన్

కడప స్పోర్ట్స్ నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్‌లోని హాస్టల్‌ను గురువారం శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పరిశీలించారు. అక్కడి విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. బాలికల వసతి గదులు అధ్వానంగా ఉన్న సంగతిని గ్రహించారు. అందులో గల ఫ్యాన్లలో కొన్ని తిరగడం మానేసినట్లు గుర్తించారు. వెలగని లైట్స్ నిర్వహణకు నోచుకోని టాయిలెట్స్ గుర్తించి అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భోజనశాల పరిశీలించి వంటలను రుచి చూసి నాణ్యత లోపించడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్తీనూనె, ఆహార పదార్థాలను గుర్తించి ఆరా తీయగా సదరు కాంట్రాక్టర్ నాసిరకం పదార్థాలను పంపిణీ చేస్తున్నట్లు అక్కడి వంట సిబ్బంది బదులిచ్చారు. దీంతో అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డీఎస్‌డీఓకు ఆదేశాలిచ్చారు.

వైసీపీ నేతలపై హత్యాయత్నం కేసు

మైదుకూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లి శివరామకృష్ణ, నేట్లపల్లి రామాంజనేయులుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. గతంలో మైదుకూరు మండలం నంద్యాలపేట రెవెన్యూ పొలం సర్వే నెంబరు 1910లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును పాతుతుండగా వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం అతని సోదరుడు రామాంజనేయులు ఈ పొలం మాది అంటూ వారిని అడ్డుకున్నారు. అంతేకాకుండా వారిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఈ నెల 2వ తేదీన కేసు నమోదు కాగా గురువారం వారిని అరెస్ట్, చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

కడప (క్రైం), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలోని మల్టీస్పెషాల్టి ఆసుపత్రిలో పనిచేస్తున్న యువతి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి అక్కడే పనిచేస్తున్న యువకుడు ప్రేమించుకుంటున్నారు. ఇరువురి మధ్య ఏం జరిగిందో కానీ యువతి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. దీంతో యువతిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైనా వైద్యం కోసం వేలూరికి తరలించినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చోరీ కేసులో మహిళ అరెస్టు

కడప (క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నబీకోటలో గతనెలలో జరిగిన చోరీ కేసులో మహిళను పోలీసులు అరెస్టు చేశారు. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు నబీకోటకు చెందిన దేవి ఇంట్లో నిందితురాలు కవిత గతనెల వెళ్లి బీరువాలో ఉన్న రూ.లక్ష 20వేలు నగదును చోరీచేసినట్లు తెలిపారు. బాధితురాలు దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కవితను అరెస్టు చేసి.. ఆమె వద్ద నుంచి రూ.50వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దివంగత ఎంపీ డీఎన్‌రెడ్డి సతీమణి మృతి



పులివెందుల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ దివంగత నేత, స్వర్గీయ మాజీ ఎంపీ డాక్టర్ డీఎన్‌రెడ్డి సతీమణి డి.లక్ష్మిదేవమ్మ (95) గురువారం మృతి చెందారు. హైదరాబాద్‌లో గత ఐదు నెలలుగా కుమారుడు రమణారెడ్డి వద్ద ఉండేవారు. కొద్దిరోజుల నుంచి అనారోగ్యం బాధపడుతూ గురువారం మృతి చెందారు.

150 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులు దాడులు చేపట్టారు. గురువారం కోనేటికాల్వ వీధి, శివాలయం వీధి, గాంధీరోడ్డు తదితర ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్ చేశారు. ఈప్లాస్టిక్ వస్తువులను మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చి కమిషనర్ ఎదుట వుంచారు. కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ 120 మైక్రాన్‌లకంటే మందం తక్కువగా వున్న ప్లాస్టిక్ కవర్లు నిషేదమన్నారు. వ్యాపారులు వీటిని విక్రయించడం నేరమన్నారు. ప్లాస్టిక్ విక్రయ దారులకు జరిమానా విధించామన్నారు. ఈదాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీత సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరటి వ్యాపారి ఐపీ.. ఆందోళనలో రైతులు

● 30 మంది రైతులకు రూ.1.20 కోట్లు ఎగవేత

లింగాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తుని నమ్మక ద్రోహానికి అరటటి రైతులు బలయ్యారు. సుమారు 30 మంది రైతులకు రూ.1.20 కోట్లు ఎగ్గొట్టిన ఉదంతం ఇది. రైతుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. లింగాల ఎస్ఐ మధుసూదన్‌రావు, రైతుల కథనం మేరకు వివరాలిలా..

మండలంలోని వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ర మల్లికార్జునరెడ్డి అరటి కాయల వ్యాపారం చేసేవాడు. సాధారణంగా అరటి దిగుబడులను మార్కెట్‌కు తరలించిన తర్వాత వారం పది రోజుల్లోగా రైతులకు డబ్బులు ఇచ్చేవారు. అలా సుమారు 30 మంది రైతులకు చెందిన అరటి దిగుబడులను మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకొని రైతులకు ఇవ్వకుండా వ్యాపారస్తుడు పరారయ్యాడు. రైతులకు చెందిన డబ్బులను మల్లికార్జునరెడ్డి తన కుమార్తె వసుప్రియ, అల్లుడు భవానిరెడ్డిలు నూతనంగా నిర్మించిన ఇంటికి ఉపయోగించారని, తమకు డబ్బులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇటీవల సుమారు 20 మంది రైతులకు వ్యాపారస్తుడు మల్లికార్జునరెడ్డి ఐపి నోటీసులు పంపడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో లింగాలకు చెందిన రైతు ముచ్చుమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తనకు రూ.8.25లక్షలు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మల్లికార్జునరెడ్డి, అల్లుడు, కుమార్తె భవానీరెడ్డి, వసుప్రియలపై ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మధుసూదన్‌రావు వారిపై కేసు నమోదు చేశారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

వేముల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తిభవన్‌లో మండల మహిళా సమాఖ్యలో గ్రామ సమాఖ్య అసిసెంట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా ఉత్పత్తులు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ విధానంలోకి తీసుకురావాలన్నారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుదలకు బ్యాంకుల ద్వారా నారిశక్తి రుణాలను, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ సబ్సిడీరుణాలను అనుసంధానం చేయలని ఆదేశించారు. వెలుగు ఏపీఎం ఆంజనేయులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు జ్యోతి, జైపాల్, హరికృష్ణ, నాగేశ్వరి, గంగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

అండర్-14 అథ్లెటిక్స్ విజేతలు



బాలుర విభాగంలో ఛాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కడప జట్టు క్రీడాకారుడు

ఉంగుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల,బాలికల అథెటిక్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. రెండురోజుల పాటు జరిగిన ఈ పోటీలు కైకరం, నారాయణ పురం చింతలపాటి బాపిరాజు స్టేడియంలో జరిగాయి. బాలికల ఛాంపియన్‌గా అనంత పురం జిల్లా, బాలుర ఛాంపియన్‌గా కడప జిల్లా జట్లు విజయం సాధించాయి. పోటీల రాష్ట్ర పరిశీలకుడు ప్రసాదరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.అలివేలు, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు గుళ్ల ప్రసాదరావు వారికి బహుమతులు అందజేశారు.

ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ పోటీలు

పులివెందుల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ క్రీడాప్రాంగణంలో గత నాలుగురోజులుగా జరుగుతున్న సాఫ్ట్ టెన్నిస్ బాలుర విభాగం క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర విజేతలుగా కడప, అండర్ 17 విభాగంలో కడప, చిత్తూరు అండర్ 19 విభాగంలో గుంటూరు క్రీడాకారులు విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు డీవీ కొండారెడ్డి, విశిష్టఅతిథి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌లు ప్రసంగించారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్‌కు దూరం





వేంపల్లె: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చందన... కడప: వైవీయూలో ర్యాలీ

వేంపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, తద్వారా క్యాన్సర్ మహమ్మారికి దూరంగా ఉండొచ్చని డాక్టర్ చందన అన్నారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో క్యాన్సర్ కణాలు ఉంటాయని, శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గినపుడు క్యాన్సర్ కణాలు ప్రబలుతాయన్నారు. కావున వ్యాయామం, సమతుల్య ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, తిరుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్‌కు దూరం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ పట్ల అవగాహన, ఆరోగ్యకరమైన అలవాట్లతో క్యాన్సర్‌కు దూరం కావచ్చని వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ తెలిపారు. గురువారం ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ లలిత, డాక్టర్ సునీత, మైనార్టీ సెల్ కన్వీనరు డాక్టర్ రియాజున్నీసా ఆధ్వర్యంలో నేషనల్ కేన్సర్ అవేర్‌నెస్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించడం, సమర్థవంతమైన చికిత్స ద్వారా మరణాలను తగ్గించవచ్చన్నారు. యువత గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ గురించి అవగాహన పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొఫెసరు దాము, సంచాలకులు డాక్టర్ చరిత, ఐక్యూఏసీ సంచాకులు సుబ్రమణ్యశర్మ, సుభాష్‌చంద్ర పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవాహన

పెండ్లిమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ వినయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ మార్గరేట్, ఎపీహెచ్ఎస్ రవీంద్రనాథ్, వెంకటసుబ్బమ్మ, స్టాఫ్‌నర్స్ రేణుక, రూతమ్మ, సీహెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరు మండలంలో ఆయకట్టుకు వెళ్లే దారిలో కేసీ ప్రధాన కాల్వ వద్ద పెద్ద గుంత ఏర్పడి ఐదేళ్లయినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఆ దారిన వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్రఇబ్బందులుపడుతున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని విన్నవిస్తున్నారు. - చెన్నూరు,(ఆంధ్రజ్యోతి)

శిశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలి: జడ్జి



వివరాలు తెలుసుకుంటున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి):శిశువుల ఆరోగ్యం పట్ల శిశుగృహాల నిర్వాహకులు శ్రద్ధ వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం శిశు రక్షణ దినోత్సవం సందర్భంగా కడప నగరం కొండాయపల్లెలోని శిశుగృహాన్ని సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ శిశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలన్నారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2015, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర అంశాలను వివరించారు.

ఆత్మీయ సదస్సుకు హాజరుకావాలి

వేముల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 17వ తేదీ జరిగే మాదిగల ఆత్మీయ సదస్సుకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. గురువారం మండలంలోని బెస్తవారిపల్లె గ్రామంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి సదస్సుకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామకృష్ణ, నాగేశ్వరరావు, సూరి, గంగరాజు, శివ, ఉత్తయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ డే

కడప, వినాయకనగర్,నవంబరు7(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ డే ఏర్పడి 70 సవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవంబరు 7న స్కౌట్స్ అండ్ గైడ్స్ డేని స్థానిక శంఖాపురంలోని స్కౌట్స్ కార్యాలయంలో అసిస్టెంట్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సైప్ సీఈఓ సాయిగ్రేస్, వైవీ యూనివర్సిటీ సహాయ ఆచార్యులు లలిత, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, ఎంఈఓ గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిగ్రేస్ మాట్లాడుతూ స్కౌట్స్ వారసత్వాన్ని భావితరాలకు కొనసాగించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్కౌట్ కమిషనర్ రెహమాన్, పీడీ రాజేశ్, మాస్టర్ ఓబయ్య, కెప్టెన్లు హసీనా, రూతూ, సునిత, రమణమ్మ, సంతోశ్, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు భరోసా

సీకేదిన్నె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు కార్యకర్తలకు భరోసా ఇస్తుందని టీడీపీ నాయకుడు అన్నం చిన్నమల్లయ్య తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం నర్సరామయ్యగారిపల్లి గ్రామంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఐటీడీపీ సభ్యులు ఆది, పట్టాభిరాఘవ, వంశి పాల్గొని సభ్యత్వ నమోదును ఇంటింటికి తిరిగి చేపట్టారు.

'శిక్షణను రద్దు చేయండి'

కడప, వినాయకనగర్, నవంబరు(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇచ్చే లీడర్‌షిప్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమాలను రద్దు చేయాలని ఎస్టీయూఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ప్రసాద్, రవిశంకర్, సలాం, పీరాం పాల్గొన్నారు.

మహిళను అవమానించడం దుర్మార్గం : టీడీపీ

కడప సెవెన్‌రోడ్స్, న వంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవీ పట్ల మేయరు వ్యవహరించిన తీరు దారుణమని టీడీపీ నేతలు బోనం సిలాస్, రాజగోపాలరెడ్డి పేర్కొన్నారు. గురువారం తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో మేయరు పక్కన ఎక్స్‌అఫిషియో సభ్యులకు రెండు కుర్చీలు వేసే వారని, అందులో కడప, కమలాపురం ఎమ్మెల్యేలు కూర్చునేవారన్నారు. ప్రస్తుతం ఆయా స్థానాల్లో ఉన్న మాధవీరెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి కూర్చునే అవకాశం లేకుండా చేయడం దారుణమన్నారు.

మేయరు క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే మాధవి పట్ల మేయరు సురేశ్‌బాబు వ్యవహరించిన తీరు దారుణమని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ అన్నారు. కావున క్షమాపణ చెప్పాలన్నారు.

వైవీయూ లా ఆఫీసరుగా రెడ్డయ్య

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం లా ఆఫీసరుగా డి.రెడ్డయ్యను నియమిస్తూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు పద్మ ఉత్తర్వులు విడుదల చేశారు. గురువారం రెడ్డయ్యకు వైస్‌చాన్సలర్ కె.క్రిష్టారెడ్డి నియామకపత్రం అందించారు. ఈయన పార్ట్ టైం బేసిక్‌లో విధులు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌కు తుంగా రమణయ్య స్వాగతం



శాప్ చైర్మన్ రవినాయుడికి స్వాగతం పలుకుతున్న తుంగా రమణయ్య

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు కడప పర్యటనకు వచ్చిన సందర్భంగా కడప జనసేన నాయకుడు తుంగా రమణయ్య, ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

ఉర్దూ భాషాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వండి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఈ నెల 9, 10తేదీల్లో జరగబోయే ఉర్దూ జాతీయ సెమినార్‌లో భాషాభివృద్ధికి సంబంధించి సూచనలు, సలహాలు పంపించాలని సెమినార్ చీఫ్ ప్యాట్రన్ అమీర్‌బాబు కోరారు. గురువారం రహ్మతీయ ఫంక్షన్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంజుమన్ తరక్కీ ఉర్దూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ హిదయతుల్లా సెల్.9000757727నెంబరుకు సలహాలు పంపించాలని కోరారు. అంజుమన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్ సత్తార్, సభ్యులు అష్రఫ్ ఆలీ ఖాన్, నజీర్ అహ్మద్, రహ్మతుల్లా, బుఖారి, మగ్బుల్ పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షల మూల్యాంకనం డబ్బు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిధులు మంజూరైనా పదోతరగతి పరీక్షల మూల్యాంకనం డబ్బులు చెల్లించాలని పీఎస్‌టియు జిల్లా అధ్యక్ష/లు సుబ్బారెడ్డి, రాష్టర అధ్యక్షులు లెక్కల జమాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం డీఈవో ఆఫీసులో డీఈవోకు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన అధికారులకు ఉపాధ్యాయులకు నిధులు చెల్లించారని వైఎస్‌ఆర్ జిల్లాలో నిధులు విడుదలై 15 రోజులు అవుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

రూ.2.20 కోట్లతో అభివృద్ధి పనులు

కమలాపురం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీలో రూ.2.20 కోట్లతో డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకలెక్టరుకమలాపురం అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు రూ.2.20 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో ఆయా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

నూతన సొసైటీ ప్రారంభం

కమలాపురం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విభరాపురంలో గురువారం 'అమ్మనాన్న ఫౌండేసన్' పేరుతో సొసైటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలచెన్నయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులకు, పిల్లలకు దూరమైన తల్లిదండ్రులకు సేవలందించేందుకే ఈ ఫౌండేషన్ స్థాపించామన్నారు.

ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలి

కమలాపురం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని పెద్దచెప్పలి పీహెచ్‌సీ డాక్టర్ జావలి ప్రసన్న తెలిపారు. గురువారం పెద్దచెప్పలి పీహెచ్‌సీ పరిధిలో క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే కాపాడవచ్చన్నారు. ఆరోగ్యసిబ్బంది ప్రతి గ్రామంలో తిరిగి క్యాన్సర్‌పై సర్వే నిర్వహించాలన్నారు.

ఎన్జీరంగ సేవలు అభినందనీయం



ఆచార్య ఎన్జీరంగాకు నివాళులర్పిస్తున్న వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులు, విద్యార్థులు

సీకేదిన్నె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగ సేవలు రైతులకు, ప్రజలకు ఎంతో అమూల్యమైనవని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఆచార్య ఎన్జీరంగ 124వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్జీరంగ గొప్ప జాతీయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు అని, రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పోరాడిన రైతు బాంధవుడు అన్నారు. రైతుల్లో చైతన్యస్ఫూర్తిని నింపడానికి రైతాంగ రక్షణ పేరుతో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు నాలుగు నెలలు పాదయాత్ర చేశారన్నారు. ఆయన మార్గంలో యువత పయనించి దేశాభివృద్ధికి తోడ్పాడాలన్నారు.

వేతనాల పెంపుపై అర్చకుల హర్షం

సింహాద్రిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులకు ఇచ్చిన హామీ మేరకు వారి వేతనం రూ. 5వేలు నుంచి 10 వేలకు పెంచింది. దీంతో సింహాద్రిపురం మండల అర్చక సంఘం సభ్యులు, అధ్యక్షుడు విజయకుమార్(చిన్నస్వామి) సీఎం చంద్రబాబుకు ధన్యవాదములు తెలిపారు. వేత నం పెంచడంతో మండలంలో సుమారు 50 మంది అర్చకులకు జీవన భృతి లభించినట్లయిందన్నారు.

సమర్థవంతంగా స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణ: ఎమ్మెల్యే



స్పోర్ట్స్ స్కూల్ సిబ్బందితో సమీక్షిస్తున్న శాప్ చైర్మన్, ఎమ్మెల్యే

కడప స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శాప్ సహకారంతో కడపలోని స్పోర్ట్స్ స్కూల్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. గురువారం స్థానిక రిమ్స్ సమీపంలో గల స్పోర్ట్స్ స్కూల్‌లో అక్కడి ఉద్యోగులు, డీఎస్ఏ అధికారులతో శాప్ చైర్మన్ రవి నాయుడు నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్పోర్ట్స్ స్కూల్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం ఆ స్కూల్ నిర్వహణ, హాస్టల్ సదుపాయాలు, క్రీడాకారులకు అందుతున్న మెనూ, వసతులు, వైద్యపరీక్షలు, ఉద్యోగుల విధులు, బాధ్యతలపై శాప్ చైర్మన్, ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, తెలుగు యువత అధికార ప్రతినిధి నవీన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ అమర్‌నాథ్‌రెడ్డి , డీఎస్ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

పులివెందుల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని వీధుల్లో పర్యటించి దుకాణ యజమానులను హెచ్చరించారు. మెయిన్ బజారు, పార్నపల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా వాహనాలు నిలపడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. దుకాణాలకు ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్లపై దుకాణ బోర్డులు పెట్టరాదన్నారు. బస్సులు నిలిపే ప్రాంతాల్లో ఆటోలు పెడుతుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని కొందరు ఫిర్యాదు చేయగా, ఆటోలు క్రమపద్ధతిలో తిరిగేలా చూడాలన్నారు.

శనగ, మినుము పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

వీరపునాయునిపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుటూరులో శనగ, మినుము పంటలను శాస్త్రవేత్తలు కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య, ఏరువాక కో ఆర్డినేటర్ అంకయ్య, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సునీల్, శ్రీవల్లి గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ మినుములో పల్లాకు తెగులు ఉధృతిని గమనించినట్లు తెలిపారు. తెల్లదోమ వల్ల ఈ వైరస్ వ్యాపిస్తుందని, నివారణకు మందులను సూచించారు. అలాగే లద్దెపురుగును గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు, సహాయకులు సుష్మ, రైతులు పాల్గొన్నారు.

శనగ పంటను పరిశీలించిన ఏడీఏ శంకర్‌నాయక్

పెండ్లిమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగువారిపల్లెలో సాగుచేసిన శనగపంటను గురువారం వ్యవసాయ సహాయ సంచాలకులు(రెగ్యులర్) శంకర్‌నాయక్, మం డల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఇసుకపల్లె రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

ఇంటింటా ఉచిత క్యాన్సర్ పరీక్షలు ● వాడవాడలా అవగాహన ర్యాలీ, మానహారం, సదస్సులు




వైఎంఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం - చాపాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించి ప్రాణాపాయం నుంచి బయటపడవేయడమే లక్ష్యమని కామనూరు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వచ్చి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఉచితంగా పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలన్నారు. సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు వరప్రసాద్, చంద్రకళ పాల్గొన్నారు. శ్రీరాముల పేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి భరత్ మాట్లాడుతూ నోట్లో ఎరుపు లేదా తెలుపు మానని పుండ్లు వుండడం నాలుక కింద, రొమ్ములో గడ్డలు, రొమ్ము నొప్పి, రంగు మారడం, చనుమొనలో చీము కారడం, అసాధారణ రక్తస్రావం, ఋతుక్రమంలో మార్పులు, పొత్తి కడుపులో నొప్పి, బరువు పెరగడం తగ్గడం, లాంటి లక్షణాలు క్యాన్సర్‌కు దారితీస్తాయన్నారు. క్యాన్సర్‌కు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు. వైఎంఆర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ హిమబిందు, సీఓ సుబ్బారెడ్డి ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

నర్సాపురంలో ర్యాలీ

కాశినాయన నవంబరు(ఆంధ్రజ్యోతి)7: ముందస్తు పరీక్ష క్యాన్సర్‌కు రక్ష అని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. నర్సాపురంలో వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో....

మైలవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీ నుంచి ఆరోగ్య సిబ్బంది మీ ఇంటి దగ్గరే క్యాన్సర్ పరీక్ష చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ శాంతికళ తెలిపారు. మైలవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సచివాలయాలను సందర్శించి జాతీయ క్యాన్సర్, ఎన్‌సీడీ 30పై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్, సీహెచ్‌ఓ, సూపర్‌వైజర్, పీహెచ్‌సీ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

చాపాడు మండలంలో...

చాపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని డాక్టర్లు ఓబులేసు, కావ్యమాధురి, శ్రీవాణి అన్నారు. చాపాడు, నక్కలదిన్నె, ఖాదర్‌పల్లె గ్రామాల్లో క్యాన్సర్‌పై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

దువ్వూరు మండలంలో...

దువ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్‌బాబు, వికసిత, రోహిణి, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట మండలంలో...

ఖాజీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం, దూమపానంతో క్యాన్సర్ వస్తుందని వైద్యాధికారి ముబీన్ అన్నారు. శ్రీచైతన్య స్కూల్, కస్తూర్బాగాంధీ, బాలుర హైస్కూలులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శరీరంలో ఖనిజాలు, అవయవాలను ఏర్పరచడానికి ప్రిమియన్లు కణాలతో రూపొందించబడ్డాయన్నారు. శరీరానికి అవసరం లేకపోయినా కొత్త కణాలు ఏర్పడి పాత కణాలు క్షీణించవన్నారు. ఇలా ఏర్పడిన కణాల సముదాయం కంతి, గడ్డలాగా ఏర్పడి అవి క్యాన్సర్ గడ్డలుగా మారుతాయన్నారు. ఇలాంటి గడ్డలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, ఏఎన్‌ఎంలు శాంతమ్మ, మహేశ్వరి, వెంకటసుబ్బమ్మ, పీహెచ్‌వో కీర్తి, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న విద్యార్థులు



కూర్చుని మాట్లాడుతున్న వర్షిణి

కొండాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న బాలికలు వర్షిణి, పల్లవి కోలుకుంటున్నారని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ప్రొద్దుటూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వర్షిణికి వైద్యులు వెంటిలేటర్ తొలగించినట్లు తెలిపారు. దీంతో ప్రస్తుతం వర్షిణి కూర్చుని మాట్లడుతోందన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పల్లవి కోలుకుని శుక్రవారం డిశ్చార్జి అయ్యే అవకాశం ఉందన్నారు.

సబ్సిడీ వంద శాతం నిధులు మంజూరు



షెడ్డును నిర్మిస్తున్న లబ్ధిదారుడు

దువ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పశువులు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి వంద శాతం సబ్సిడీ నిధులు మంజురయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మండలాలవారీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. మండలానికి 25 యూనిట్లు మంజూరయ్యాయి. వంద శాతం సబ్సిడీతో నిధులు కేటాయించడంతో నిరుద్యోగ యువకులకు ఊతమిచ్చినట్లైంది. పశువుల పెంపకంతో ఉపాధి పొందాలనుకున్నవారికి ఆరు పశువులకు షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, రెండు పశువులకు రూ.1.15 వేలు మంజూరు చేయనున్నారు. గొర్రెలు, మేకల పెంపకంలో 50 గొర్రెలకు రూ.2.30 లక్షలు, 20 గొర్రెలకు రూ.1.30 లక్షలు ఇవ్వనున్నారు. కోళ్లపెంపకంలో 200 కోళ్ల షెడ్డుకు రూ.1.32 లక్షలు, 100 కోళ్ల షెడ్డుకు రూ.87 వేలు మంజూరు చేయనున్నట్లు ఉపాధి అధికారి వసంతకుమార్ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ అన్నారు. గీతాశ్రమంలో నిర్వహిస్తున్న నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ ఆరాధన మహోత్సవాల్లో మాతాజీ ప్రవచనాల్లో పాల్గొని ప్రజలు ప్రశాంతజీవనం కోసం దైవదర్శనం చేసుకోవాలన్నారు.

మౌలిక సదుపాయాలు కోరుతూ ధర్నా



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

బద్వేలు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): సి. కొత్తపల్లె గుడిసె వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ 10 నెలలుగా సి.కొత్తపల్లె వాసులకు సదుపాయలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, ఇమ్మానుయేల్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలోమల్లమ్మకుంట



ఆక్రమణకు గురైన మల్లమ్మకుంట

పోరుమామిళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కవలకుంట్ల పంచాయతీ మల్లమ్మకుంట సర్వేనెం.1002లో ఆక్రమణలపై గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు చంద్రశేఖర్ వీఆర్వో నారాయణను ఆదేశించడంతో ఆక్రమణలను నిలుపుదల చేశారు. వివరాల్లోకెళితే....

మల్లమ్మకుంటలో దాదాపు 50 ఎకరాల చెరువు స్థలం ఉంది. అయితే వైసీపీ నేతలు అధికార పార్టీ నేతలు కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పశువులు నీళ్ల తాగడానికి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని, కరెంటులైను లాగి బోరు వేసి పంట వేయడానికి సిద్ధమయ్యారని గ్రామస్తులు వీఆర్వోదృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయం తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లగా వీఆర్వో ఆక్రమణలు అడ్డుకున్నారు. ఏదైనా ఆధారాలు ఉంటే తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలని అంత వరకు ఈ స్థలంలో ఎవరూ దిగరాదని హెచ్చరికలు జారీ చేశారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

పోరుమామిళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టేకూరుపేటలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దుర్గామోహన్ తెలిపారు. ఎస్‌ఐ కొండారెడ్డికి అందిన సమాచారం మేరకు గాజుబావి వద్ద కంపచెట్లలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోండి

మైదుకూరు రూరల్,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టకపోతే రైతులు పూర్తిస్థాయిలో ఆర్థికంగా నష్టపోతారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. శివపురం రైతు సేవ కేంద్రం పరిధిలో జిల్లా అధికారి నాగేశ్వర్‌రావు, ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏఓ ప్రసన్న జొన్న, మినుము పంటలను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు డెలిగేట్ లేదా బారజోడ్ 2.5 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మినుములో లద్దె పురుగు నివారణకు ఫ్లూ బెంబమైడ్ 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

220 కేవీ లైన్ విస్తరణ పనులకు శంకుస్థాపన

మైదుకూరు రూరల్,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 220 కేవీ సబ్‌స్టేషన్ విస్తరణ పనుల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన జరిగింది. గురువారం బద్వేలు రోడ్డులోని 220 కేవీ సబ్‌స్టేషన్, మైదుకూరు సబ్‌స్టేషన్, 220 కేవీ బమ్మలమడుగు, పోరుమామిళ్లకు అనుసంధానం చేసేందుకు, 220 కేవీ లైన్ నిర్మాణం, 220 కేవీ మైదుకూరు సబ్‌స్టేషన్‌లో విస్తరణ పనుల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన జరిగింది. ఈ నిర్మాణం పూర్తి అయితే సుమారు మూడు లక్షల యాభైవేల మందికి మెరుగైన విద్యుత్ లభిస్తుందని అధికారులు తెలిపారు.

డ్వాక్రా గ్రూపుల డేటా సేకరణ

ఎర్రగుంట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల డేటా సేకరణను మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పేర్లి శేషఫణి తెలిపారు. సంఘం సభ్యుల నుంచి ఆధార్, పాన్ కార్డ్, రైస్ కార్డు, బ్యాంక్ అకౌంట్, గ్యాస్ పుస్తకం, మొబైల్ నెంబర్లతో కూడిన వివరాలు సేకరించాలన్నారు. వారికి ఒక తేదీ నిర్ణయించి ఆయా తేదీల్లో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. దీని వలన సంఘం ఆర్థిక లావాదేవీలు అన్ని కూడా ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. కుటుంబ జీవనోపాదులు మెరుగుపరుచుకోవడానికి, వారు నిర్ణయించుకున్న రంగంలో శిక్షణ కూడా ఇచ్చేందుకు ఉపకరిస్తుందన్నారు.

ఉన్నత ఉద్యోగాలు సాధించాలి : ఎమ్మెల్యే



ఉచిత శిక్షణకు వెళుతున్న అభ్యర్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత సివిల్స్ శిక్షణకు ఎంపికైన యువతులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. లక్షుమయ్య ఐఏఎస్‌స్టడీ సర్కిల్‌లో ఉచిత సివిల్స్ శిక్షణకు ఎంపికైన యువతులు హైదరాబాదుకు బయల్దేరి వెళ్లారు. వారికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారని యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి కోటా ఓబుళరెడ్డి, ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

బద్వేలుటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేషస్పందన లభించింది. స్థానిక నెల్లూరురోడ్డులోని పెట్రోలు బంకువద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ సభ్యత్వ నమోదును చేపట్టారు. బీజేపీ కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు 90వేలకుపైగా సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. లక్షసభ్యత్వ నమోదు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బీరం సుబ్బారెడ్డి, బీజేవై ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గురుశేఖర్, రామసుబ్బయ్య, బాలక్రిష్ణ, నాగేంద్ర పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను రెండు నెలలు వాయిదా వేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతేడాది చివరిలో ఏపీపీఎస్‌సీ గ్రూప్-4 నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహించారన్నారు. కాగా జనవరి5 నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని ఏపీపీఎస్‌సీ ప్రకటించిందన్నారు. డిసెంబరు చివరి వారంలో కానిస్టేబుల్ ఈవెంట్లు, రైల్వే పరీక్షలు ఉన్నాయని, జనవరిలో పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులకు సమయం సరిపోదని తెలిపారు. అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలను వాయిదా వేయాలని కోరారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ముద్దనూరు నవంబరు7(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. యామవరంలో రైతులు సాగు చేసిన మినుము పంటను కడప ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్, కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య, ఊటుకూరు ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ శ్రీవల్లి పరిశీలించారు. మినుములో సీతాఫలం ఆకు వైరస్ తెగులు సోకిందని, సమస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.